కప్పల నిశ్శబ్దం

ఇస్మాయిల్

వానలొచ్చాయి, నువు రాలేదు.
రాత్రి తెల్లార్లు
కప్పల బెకబెక

కాలువ బలిసింది.
తన విధులు మరిచిపోయింది :
వంతెనకి నీడ చూపించటం లేదు.

కీచురాయి చప్పుడుతో
గదంతా నిండిపోయింది.
గదిలో నాకు చోటు లేదు.

వాన బ్రష్షు వచ్చి
ఆకాశాన్నీ, చెట్టునీ, రోడ్డునీ,
రంగుల్నీ పులిమేసింది.

చేతనైనంత మట్టుకు
చిరువానల్ని సృష్టిస్తున్నారంతా.
చివరికి కాకి కూడా.

వాన వెలిశాక
మైదానం నిండా నీటి పడెలు,
పడెల్లో గెంతుతూ పిల్లలూ, మబ్బుపింజెలూ.

కొలనులోకి రాయి విసిరారెవరో.
అలలు ఇంకా వ్యాపిస్తూనే ఉన్నాయి.
రాయేదీ?

కొండ మీది కర్రి మబ్బూ
దండెం మీది కాకీ
రెక్కలు తెగ దులుపుకుంటున్నాయి.

దుకాణానికి వెళ్ళి చిక్కుకున్నాను,
చినుకు దారాలతో వర్షం నన్ను
పొట్లాం కట్టి పడేసింది.

విడవలేక, విడవలేక
విడవలేక వాన బొట్టు
చూరును విడిచింది.

కాజీపేట నించి కాకినాడ దాకా
ఒకటే వాన, దారి పొడుగునా
భూమ్మీద ఆరేసిన పాత ఆకాశాలు.

పచ్చిక మొలిచి
బాటని కప్పేసింది.
మళ్ళీ ఎన్ని వందల కాళ్ళవసరమో!

ఒకమ్మాయి మెడ తిప్పి
ఎవర్నో చూసి నవ్వుతోంది.
ఆ 'ఎవరో' నేనైతే ఎంత బావుణ్ణు.

నువ్వెళ్ళి తొంగి చూస్తే
వానాకాలం బావి
జూమ్‌లెన్స్ తో ఫోటో తీస్తుంది.

ఎవరి కోసం వర్షిస్తాయి మేఘాలు,
పిల్లలకోసం కాకపోతే.
గొడుగులడ్డు పెట్టుకునే వాళ్ళకోసమా?

ప్రపంచమంతా తిరిగాను కాని,
అంతరంగం అక్కడే ఉంది.
సందె దీపమూ, అమ్మ పిలుపూ.

కొబ్బరాకుల మీద
వెన్నెల
పళ్ళిగిలించింది.

ఓరకంట చూసి
కాకి ఎగిరిపోయింది.
ఎందుకు చెప్మా!

చీకట్లో
మైళ్ళ కొద్దీ నడిచాక
అకస్మాత్తుగా చంద్రోదయం.

పసుపు రంగు దుస్తుల్తో
సైకిళ్ళు తొక్కుతూ ముగ్గురమ్మాయిలు.
బజారంతా చేమంతి తోట.

ఊపిరాడని వేసవి మధ్యాహ్నం
కోయిల కూసి
వాతావరణం మార్చేసింది.

తన నీడని నిత్యం చూసుకుంటూ బతకమని
బోటుని గట్టుకు కట్టెయ్యటం
ఎంత క్రూర శిక్ష!

వీధి గోడలకి
వెన్నెలంటే ఎంత ప్రేమో!
వెన్నెట్లో మెరిసిపోని గోడ ఉందా?

ఎర్రగా మండే ఎండాకాలంలో
ఈ గుల్మొహర్ మంటలేమిటి !
మంటకి మంటే మందు.

పటిక బెల్లం తింటుంటే

పాప చూసి, ఆగింది.
దానికి పెట్టాక ఇంకా తీపెక్కింది బెల్లం.

అర్ధరాత్రి రైలు కిటికీలో
అకస్మాత్తుగా
చంద్రోదయం.

ఒక రాత్రి వేళ
సెలయేరు గలగలమంది.
ఎక్కడో కొండల్లో కురిసిన వర్షం.

సీతాకోక చిలకలా
ఎగరటం నేర్చుకుంటాను ;
అన్ని దిక్కులకీ ఒకేసారి.

కోనేట్లో దేవాలయ గోపురం.
కలచకండి నీళ్ళని, జాగ్రత్త;
గోపురం కూలిపోగలదు.

ఊరు నిద్దరోయాక
చెరువు మేల్కొంది.
తరవాత ఎవరికీ నిద్ర లేదు.

కోడిపుంజుల్ని
కోసుకు తినేసారు మా ఊరివాళ్ళు.

ఇక తెల్లారకట్ట రైలు మిగిలింది.

కాళ్ళకి కాళ్ళు తొడుక్కొని
నీళ్ళల్లో నించున్నాడు కుర్రాడు.
రెండు మొహాల్లోనూ ఆశ్చర్యం.

వీధి పొడుగునా
పిల్లంగోవి కిటికీలు,
ఒక కిటికీలో అమ్మాయి మొహం.

తెల్లారుఝాము నిద్దట్లో
రైలో, గేదో అరుస్తుంది.
లేస్తూనే పాలు సిద్ధం.

పౌర్ణమి చంద్రుడు,
ఊరంతా వెన్నెల.
నిండు కుండ తొణకదంటారేమిటి ?

నువ్వెళ్ళి పోయాక
అన్నీ అలాగే ఉన్నాయి, ఏమీ మారలేదు.
అదే నా బాధ.

పిల్లి తోకకీ
పిల్లలకీ ఏమిటీ ఆకర్షణ?
పిల్లి తోకాడిస్తోంది.

రోము నగరాన్నించి
బొమ్మ పోస్టుకార్డు పంపించాడు మిత్రుడు.
ఈ వీథుల్లో ఎక్కడో తప్పిపోయినట్టున్నాడు.

ఇద్దరు చంద్రులతో
ఇంటికి తిరిగొచ్చా నివాళ సాయంత్రం.
ఆకాశంలో ఒకడు, కాలవలో ఒకడు.

ముందు మనస్సునీ
ఆ వెనక గదినీ
తర్వాత విశ్వాన్నీ ఆవరించింది చీకటి.

కిలకిలమంటూ బడిలో పిల్లలు.
పిట్టలన్నిటికీ ఒకే పాట నేర్పాలని
పట్టు పట్టిన మేష్టారు.

చెరువు.
చెరువులో ప్రతిబింబాలు.
వాటిని అనుకరిస్తూ గట్టుపై చెట్లు.

తలకి మబ్బూ
కాళ్ళకి సరస్సూ తొడుక్కోకపోతే
కొండ కొండే కాదు.

చెరువు లేకపోతే
చెట్ల నీడల్ని
ఎవరు చేరదీస్తారు?

తెల్లారు ఝాము రైలు
తూర్పు దిగంతాన్ని చీలుస్తుంది.
అప్పుడు బైటపడతాడు సూర్యుడు.

రైల్లో తిరిగొస్తుంటే
టెలిగ్రాఫ్ తీగలతో ఊగి ఊగి
కళ్ళు నిద్దరజోగాయి.

కోవెల గోపురం
కోనేట్లో
కుబుసం విడిచింది.

దారి పొడుగుతా
రైలు చక్రాలు
నీ పేరే ఉచ్చరించాయి.

వాన జల్లుకి
వంద గొడుగులు
వెంటనే వికసించాయి.

కబుర్లాడుతూ కూచున్నాం సాయంత్రం వేళ.
క్రమంగా చీకటి పడింది.
నీ మొహమొక్కటే మెరుస్తూ చీకట్లో.

పక్షులెగిరిపోయాక రాత్రి
నక్షత్రాల్ని చేరదీస్తుంది
చెట్టు.

తాచుపాములా మెలికలు తిరుగుతూ
రైలుబండిని తరుముకుంటూ వచ్చి
కాలవలో దుమికింది బాట.

తెల్లారకట్ట
చీకటి నోరు తెరిచింది.
కాకి పిల్ల.

అర్ధరాత్రి వరకు వేచి
చంద్రవీర్యం పడగానే
పులకరించి పోయింది బావి.

టెలిగ్రాపు తీగల మీద పిట్టలు.
కొన్ని ఎడమొహం, కొన్ని పెడమొహం.
చివరికి తీగలు మిగిలాయి.

ఎర్ర పిర్రల కోతులు గెంతుతున్నాయి.

నీ పిర్రలు ఎర్రబడితే
నువ్వూ గెంతుతావు.

బట్టల్ని ఉతికి ఆరేశారు.
ఎంత ఉజ్జ్వలంగా ఉందో ప్రపంచం !
నా మనస్సు కూడా ఉతుక్కుపడినట్టుంది.

కొబ్బరాకుల కొనలు
గాలి తలని దువ్వుతుంటే
నా కళ్ళు నిద్రజోగాయి.

పదునుబెట్టిన అంచుతో
తహతహలాడుతున్నాడు చంద్రుడు.
ఒక్క మబ్బుతునకా కనిపించదేం?

వేసవి వచ్చింది కాని
కోయిల రాలేదు;
ఎండలకి విరుగుడేమిటి?

ఆకాశం నిండా మబ్బు నురగలు.
అరిగిపోయిన సబ్బు బిళ్ళ
అడుగున చంద్రుడు.

కాంతి పూర్తిగా ఎండిపోయినా
పశ్చిమాకాశాన్ని వదలని

సూర్యుడి అవశేషం.

కొబ్బరాకుల్లో చిక్కుకున్న చంద్రబింబం.
ప్రియురాలి తలపోతలో ప్రియుడు.
ఎవరు ఎవర్ని వెలిగిస్తారు?

మెట్ల పెదిమలపై
మెల్లగా విస్తరిస్తూ
వెన్నెల చిరునవ్వు

కాకినాడ ఆకాశంలో
విరిసింది సంజగులాబీ.
నగరవాసులే దీనికి ముళ్ళు.

మామిళ్ళు పూచాయి.
తోపునిండా, కాపు తల నిండా
తుమ్మెద ఝుంకారం.

వేసవి రాత్రులు వచ్చాయి.
చుక్కలు లెక్కిస్తూ
నిద్రలోకి జారుకోవచ్చు

లక్ష నక్షత్రాలతో
గ్రీష్మ నిశీధాలు
నా పై ప్రవహించి పోనీ!

వేసవి రాత్రి.
ఆరుబైట ఎన్ని పక్కలు!
ఆకాశంలో ఎన్ని చుక్కలు!

వాన కురుస్తున్న చప్పుడికి
ఒళ్ళు పులకరించింది.
వాన కాదు, కొబ్బరాకుల్లో గాలి.

చీకటి స్టేషన్‌లో రైలాగింది.
రైలు వెళ్ళాక మళ్ళీ చీకటి.
స్టేషను పేరు తెలీదు.

రకరకాల శబ్దాలు
చేస్తోంది వాన.
ఏమంటుందో తెలీదు.

మూల పడి వుంది గొడుగు.
వానలొస్తే కాని
ఇది వికసించదు.

లాంతరు వెలుతుర్లో
పాప చదువుకుంటోంది.
ఎవరు ఎవర్ని వెలిగిస్తున్నారు?

కొండెక్కుతుంటే
తలకిందులుగా
కోయిలకూత.

వెన్నెట్లో మెరిసిన
కొబ్బరి ఈనెలు
ఇల్లు ఊడుస్తున్నాయిప్పుడు.

చెట్టు మీంచి పిట్టపాట.
చెట్టంతా వెతికాను.
పిట్ట కనిపించదు.

నీళ్ళ నిండా మబ్బు పింజెలు.
లంకల నిండా రెల్లు దుబ్బులు.
గోదావరంతా తెల్లబడింది.

పిట్టల్ని తోలమని
పాపని కాపలా పెడితే
కాకుల్తో స్నేహం చేస్తోంది.

కొబ్బరాకులకీ
పిల్లల ఆటలకీ
వెన్నెల మెరుగుపెట్టింది.

చీకట్లో పట్టాలు మెరుస్తున్నాయి
రైలొచ్చి, ఆగి వెళ్ళింది.
తిరిగి పట్టాలు మెరుస్తున్నాయి.

నిన్న రాత్రి
ఎంత వెన్నెల కాసింది!
కాకులు కూడా నిద్రపోలేదు.

పడుకునే ముందు పిల్లలు
దెయ్యాల కథలు చెప్పుకుని
ఒకర్నొకరు భయపెట్టుకుంటున్నారు.

కప్పలకీ కీచురాళ్ళకీ
సంగీత పోటీ!
వర్షా సంధ్య.

మా యింటికి
పేరంటానికొచ్చింది కప్పపిల్ల.
వానలొచ్చిన సంబరం.

గోడ కూలిపోయింది.
చంద్రోదయం
ఎంచక్కా చూడొచ్చు ఒక మీదట.

చెట్టు కింద

సగం కొరికిన జామి పిందెలు.
పైకి చూస్తే చెట్టు నిండా చిలకలు.

జ్ఞానముద్రలో కూచున్న
బుద్ధుడు.
బోదురు కప్ప.

ఇంత వెన్నెల కాస్తున్నా
కాకి
నల్లగా అరుస్తోంది.

సముద్రం ఆవేశపడుతుంటే
నది ప్రశాంతంగా ప్రవహిస్తోంది :
సాగర సంగమం.

కొత్త కోక కట్టుకొచ్చింది.
సీతాకోక చిలక.
శ్రావణ మాసం కదా.

బుల్లోడికి బుల్లికాయ
బుల్లి చంద్రుడు.
రాత్రి దుప్పటి సరిగా తడవలేదు.

పొగ చూరిన చిమ్నీలో
చిక్కుపడిన దీపశిఖ.

పంజరంలో పక్షి.

పొద్దున లేస్తూనే
ఫర్నీచరునీ నన్నూ కలిపి
పాలిష్ చేస్తోంది మా ఆవిడ!

సూర్యుడు అస్తమిస్తుంటే
గుళ్ళో గంటలు
మేల్కొన్నాయి.

అలల చేత తాపులు తింటోంది
సముద్రపొడ్డున ఒకే బండ.
తోటి బండలేమయాయి?

ఆకాశంలో మునకవేసి
మరింత నీలంగా వాలింది.
పాలపిట్ట.

అల్లరి చేసి, ఆపి,
తోచక తిరిగి అల్లరి చేస్తున్నాడు
ఒంటరి పిల్లవాడు.

పిల్లి నా పక్క మీద
గాఢ నిద్ర పోతోంది.
దీన్నెలా లేపను!

ఈ బాట మీద
ఎవ్వరూ నడవగా చూడలేదు.
ఇదిక్కడికి ఎలా వచ్చింది?

ఈ ఊళ్ళో
తాటిచెట్లు కూడా
వంకరే!

పిల్లి నిశ్చింతగా పడుకుంది.
దానికి తెలుసు
లేవగానే ఆహారం పంపిస్తాడని
పిల్లుల దేవుడు!

గొడుగులా ముడుచుకుని
ఎండాకాల మంతా
నిద్దరోగలిగితే బాగుణ్ణు.

ఈ దేశంలో
నా కర్ధమయేది
పక్షుల భాష ఒక్కటే.

దుమ్ముతో చెట్లూ,
టీ కొట్టూ ఎర్రబడ్డాయి.
టీ కూడా అదే రంగు.

నీలాకాశమంతా ఈది
ఇంకా తెల్లగానే వున్నాయి.
తెల్ల కొంగలు.

బోటుని
దాని నీడకి కట్టేసి
పడవ సరంగు ఎటో పోయాడు.

పిట్టలు ఎగిరాక గాని
కళ్ళంలో
పిట్టలు వాలినట్లు తెలీదు.

పౌర్ణమి చంద్రుణ్ణి
ఒక్కొక్కచెట్టుకు వేలాడదీస్తూ
తోటంతా తిరిగాను.

మనల్నింతగా అలరించే పక్షులు
పక్షులుగా నటించటానికి
ఎంత కిరాయి తీసుకుంటున్నాయి?

దుప్పటి కప్పుకోకపోతే
దోమల బాధ
కప్పుకుంటే ఉక్క.

నా ఫోటో
నా కన్యాయం చేస్తుందని
నా కనుమానం.

రోడ్డు మీద ఆంబోతు తిష్టవేసింది .
పక్కనే ట్రాఫిక్ నడుపుతూ
ట్రాఫిక్ పోలీసు.

పెందలాడే నిద్దరోయి
పొద్దెక్కి లేస్తారు.
పిల్లల్ని చూస్తే నా కసూయ.

పిల్లి
రాత్రంతా రాసక్రీడ లాడి వచ్చి
తలుపు తెరవమని గీరుతుంది.

చిలక్క
మా ఆవిడ మాటలు నేర్పుతోంది.
ఇప్పుడు మా ఇంట్లో రెండు చిలకలు.

ఒంటరి బాటపై
ఒంటరి చంద్రుడు
ఒకరి ఒంటరితనాన్ని ఒకరు హెచ్చవేస్తూ.

పాప నన్ను చూసి సిగ్గుపడి
అడ్డున్న గౌను కాస్తా ఎత్తి
మొహం కప్పుకుంది.

గోడెక్కి పిలుస్తోంది.
పొరుగు చెట్టుక్కాసిన పువ్వు
కోస్తే ఎవరి తప్పు?

ఈ చెట్టు కింద రోజూ నిలబడతాను.
చెట్టుకి నా పేరు తెలుసా?
నేను దాని పేరడిగానా?

చిలకని పంజరంలో బంధిస్తే
అడివిని తన కూడా తెచ్చుకుంది.
ఇల్లంతా జామకాయల వాసన.

బాజాలు బాత్తున్నారు.
తన గతీ అంతేనని తెలీని పెళ్ళికొడుకు
సంబరంగా తాళి కడుతున్నాడు.

టేబిల్ మీదుంచిన కొత్త ఫ్లవర్‌వాజ్
గదిని శాసిస్తోంది.
ఇది నా గదేనా?

రాబోయే వాని కన్న

గడిచిపోయినవి నాకిష్టం.
అందుకే, రైల్లో వెనక్కి తిరిగి కూచుంటాను .

కరెంటు పోయిందని
కొవ్వొత్తి వెలిగించిందీవిడ.
కొవ్వొత్తి వెలుతురులో కొత్తందాలు.

అర్ధరాత్రి వేళ
కప్పల నిశ్శబ్దానికి
హటాత్తుగా మెలకువొచ్చింది.

oooooooooooooooo